క్లుప్తంగా

53 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగరాజు

రేగిడి: మండలంలోని ఉప్పరనాయుడువలస గ్రామంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం ఆధ్వర్యంలో హెల్పేజ్ ఇండియా సౌజన్యంతో విజయనగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బి.నాగరాజు పర్యవేక్షణలో శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 53 మందికి కంటి పరీక్షలు చేసి ఏడుగురిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటు కళ్లద్దాలు, మందులు అందజేయనున్నట్లు డాక్టర్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం లక్ష్మి, ఎంపీటీసీ పాగిరి అప్పలనాయుడు, కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై పోలీసుల ప్రచారం

రేగిడి: డ్రగ్స్ నిర్మూలనపై రేగిడి పోలీసులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి మత్తు పదార్థాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ వాల్‌పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత గంజాయి, కొకైన్, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని, శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు.

రారవే లోగో ఆవిష్కరణ

రాజాం సిటీ: రచయితలు సమాజాన్ని చైతన్యం చేసేలా రచనలు చేయాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో రాజాం రచయితల వేదిక లోగోను శనివారం ఆయన ఆవిష్కరించారు. సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా రచనలు కొనసాగించాలని రచయితలకు సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, ఏపీపీ సూర్యారావు, వేదిక నిర్వాహకులు గార రంగనాథం, సభ్యులు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆర్థిక సాయం

బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కష్టాల్లో ఉన్న తోటి స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. కరోనా సమయంలో మృత్యువాత పడిన తోటి స్నేహితుల కుటుంబాలను ఆదుకున్నారు. ముగడలోని టేకు పద్మ, ముగడ కాలనీలోని యామల రమణమ్మ, భీమవరం గ్రామానికి చెందిన చింతల గోపాలనాయుడు కుటుంబాలకు రూ. 40 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో గొర్లి ప్రకాష్, పోతాబత్తుల శ్రీనివాసరావు, కొల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేలతల్లి బాగు

బొబ్బిలి రూరల్: నవధాన్యాల సాగుతో నేలతల్లి బాగుపడుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని భోజరాజపురంలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీ, బీజామృతం తయారీలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులంతా ప్రకృతి సేద్యం చేయాలని సూచించారు. ప్రకృతి సేద్యం డివిజన్ కోఆర్డినేటర్ వాండ్రాసి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

4,056 మందికి వైద్యసేవలు

రామభద్రపురం: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం అమలు చేస్తోందని, దీని ద్వారా మండలంలో జనవరి వరకు 4,056 మందికి వైద్య సేవలందించామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మండలానికి ఒక 104 వాహనం ద్వారా నెలలో ఒక సచివాయం పరిధిలో ఒకసారి మాత్రమే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మార్చి నెల నుంచి మండలంలోని రెండు పీహెచ్‌సీల పరిధిలో రెండు 104 వాహనాలు ఉంటాయని.. 15 రోజులకోసారి సచివాయం పరిధిలో వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు కుటుంబానికి పరామర్శ

రేగిడి: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కింజరాపు రామ్మూర్తినాయుడు(83) ఇటీవల మృతి చెందారు. కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం రామ్మూర్తినాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను ఆయన కుమారులు కింజరాపు వెంకటరమణ, జగన్నాథనాయుడు, అల్లుడు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిలను అడిగి తెలుసుకున్నారు. రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం తెలియజేశారు. వారి వెంట వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు గుండ రఘురాం, మాజీ జెడ్పీటీసీ సుగుణమ్మ, పోలినాటి వెలమ రాష్ట్ర డైరెక్టర్ కింజరాపు పద్మావతీ సురేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొలివి జగ్గునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, గార రమణ, పాలవలస దవళేశ్వరరావు, కెల్ల మన్మథరావు ఉన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

- పదిహేనేళ్లలో రాజులు చేసిందేమీ లేదు
- 2024లో వైఎస్సార్‌సీపీదే గెలుపు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, మండల సమన్వయకర్తలు సమన్వయంతో పని చేస్తూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పట్టణ గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్ష నేత హోదాలో ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్న జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సమస్యలన్నింటినీ పరిష్కరించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. కరోనా సమయంలో వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. 15 ఏళ్లు అధికారంలో ఉన్న బొబ్బిలి రాజులు బొబ్బిలి నియోజకవర్గానికి కి ఏం చేశారని మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. నాటి టీడీపీ ప్రభుత్వంలో సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు 40 కోట్ల రూపాయలు బకాయి పడితే తాము ధర్నాలు, ఆందోళనలు చేయగా.. రాజులు కోటకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు బకాయిలు చెల్లించామని, తాగు, సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు.

అవినీతి రహిత పాలన..

ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ, అవినీతిరహిత పాలన అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బొబ్బిలి రాజులు అబద్ధాలు ప్రచారం చేయడంలో దిట్ట అని ఆరోపించారు. సమావేశంలో పట్టణ జేసీఎస్ కన్వీనర్ రేజేటి విశ్వేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులిరాజు, తూముల భాస్కరరావు, తూముల రామసుధీర్, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్ తెంటు పార్వతి, బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు చెలికాని మురళీకృష్ణ, గొలగాన రమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, యువ నాయకులు శంబంగి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు

రామభద్రపురం: రానున్న ఎన్నికలే టీడీపీకి చివరి ఎన్నికలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, తదితర కార్యాలయ భవనాలతో పాటు రోడ్లు, సీసీ డ్రైనేజీలు, పాఠశాలల్లో అదనపు గదులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. జగనన్న పాలనను దేశం మొత్తం పొగుడుతున్నా..ప్రతిపక్షాలకు మాత్రం కనిపించకపోవడం దారుణమన్నారు. చంద్రబాబును ప్రజలెవ్వరూ నమ్మడం లేదని చెప్పారు. టీడీపీ పాలనలో రైతులకు రుణమాఫీ చేయలేదని, ఆరోగ్యశ్రీని తుంగలో తొక్కారన్నారు. ఏ హామీ నెరవేర్చామని టీడీపీ నాయకులు ప్రజలకు ఓట్లు అడుగుతారన్నారు. 2019 ఎన్నికల మాదిరిగా రాబోయే ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయలు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, మిర్తివలస మాజీ సర్పంచ్ కోట వెంకటరమణ, కటికి చిన్నారావు, కనిమెరక అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి



పాగిరి ఏపీజీవీబీ మేనేజర్ తిరుమలరావును సత్కరిస్తున్న అధికారులు

రాజాం: ప్రతీ మహిళ ఆర్థిక అక్షరాస్యత సాధించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో శనివారం రాజాం క్లస్టర్ పరిధిలోని పలు బ్యాంక్‌ల బ్రాంచ్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాల్లో సభ్యులకు, ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. అన్ని సంఘాలు డిజిటల్ విధానంలో ఆర్థిక లావాదేవీలు జరిపేలా చూడాలన్నారు. మెప్మా పీడీ సుధాకర్ మాట్లాడుతూ ప్రతీ సంఘానికి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరీ చేయాలన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల ద్వారా యూనిట్లు ఏర్పాటుకు బ్యాంకులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎక్కువ యూనిట్లు గ్రౌండింగ్ చేసిన పాగిరి ఏపీజీవీబీ మేనేజర్ తిరుమలరావు, రాజాం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ నంద, వంగర మండలం అరసాడ ఏపీజీవీబీ మేనేజర్ వెంకటేష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం బంగారమ్మ, వైకేపీ రాజాం ఏసీ చిరంజీవి, స్థానిక వెలుగు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహసారథుల ఎంపిక ప్రక్రియ పూర్తి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేగిడి: మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల అబ్జర్వర్ పాలవలస రామచంద్రి నాయుడు తెలిపారు. రేగిడిలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావుతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో 25 సచివాలయాలకు సంబంధించి ఒక్కో సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు చొప్పున నియమించామన్నారు. 393 మంది వలంటీర్లకు గాను ఒక్కో వలంటీర్ పరిధిలో ఇద్దరు గృహ సారథులతో 786 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. త్వరలో వారందరితో మండలం కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రేగిడి మండలంలో వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీని తీసుకొచ్చేలా మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తల సహకారంతో కృషి చేస్తామన్నారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

- సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

రాజాం సిటీ: రాజీయే రాజమార్గమని, అందుకు లోక్‌అదాలత్ చక్కని వేదిక అని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. స్థానిక కోర్టుల సముదాయంలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ..రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం లభిస్తుందన్నారు. అదాలత్ తీర్పే అంతిమమని అన్నారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజులు కూడా వాపసు పొందవచ్చునని అన్నారు. ప్రతి చిన్నవిషయానికి గొడవలు పడి కేసులు, కోర్టుల చుట్టూ తిరగవద్దని సూచించారు. ఈ సందర్భంగా 650 కేసులను పరిష్కరించారు. రెండు సివిల్ కేసులు, 630 క్రిమినల్ కేసులు, బీఎస్ఎన్ఎల్ ప్రీలిటిగేషన్ కేసులు 17, పొందూరు ప్రీలిటిగేషన్‌కు సంబంధించి ఒక కేసు పరిష్కారమయ్యాయి. ఈ కేసులకు సంబంధించి రూ.23,91,574లు అపరాధ రుసుం విధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచరాన రమణమూర్తి, ఏపీపీ కిమిడి సూర్యకుమార్, ఏజీపీ ఎస్.పోలారావు, వి.వెంకటనాయుడు, టౌన్ సీఐ కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

పార్టీ బలోపేతానికి కృషి

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్లు, కో కన్వీనర్లుగా ఎంపికైన వారంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. వైఎస్సార్‌సీపీ మండల సోషల్‌మీడియా కన్వీనర్‌గా మరిపి శ్రీనివాసరావు, కో కన్వీనర్లుగా పత్తిగుళ్ల ఏక్‌నాథ్, సారిక వెంకటేష్, మజ్జి బాలకృష్ణ, మామిడి రామినాయుడులను ఎంపిక చేస్తూ పార్టీ ఉత్తర్వులు జారిచేసింది. వీరందరినీ ఎమ్మెల్యే శంబంగి శనివారం అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు నిరాటంకంగా సంక్షేమ పథకాలు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మండల సమావేశంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అర్హులకు ఎటువంటి ఆటంకం లేకుండా సంక్షేమ పథకాలు అందాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల, మత, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హతే ప్రమాణికంగా.. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయశాఖపై జరిగిన సమీక్షలో ఏఓ రేణుకాసాయి మాట్లాడుతూ.. మండల పరిధిలో 92 శాతం ధాన్యం కొనుగోలు లక్ష్యాలు పూర్తిచేశామని, మరో 2 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి కోరినట్లు చెప్పారు. ఈ నెలాఖరులోగా వందశాతం లక్ష్యాలను చేరుకుంటామన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ సురేష్‌కుమార్ మాట్లాడుతూ..జగనన్న కాలనీల్లో హౌసింగ్ లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ శాఖ సమీక్షలో డీటీ సాయికామేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెలకు సంబంధించి రేషన్‌లో బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, గోదుమపిండి అందిస్తున్నామన్నారు. హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు మాట్లాడుతూ మార్చి నెలలో సామూహిక గృహప్రవేశాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆగూరు గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభించాలని సర్పంచ్ కోనారి అనూష కోరారు. గ్రామ సచివాలయాల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగులు అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రతీ నెల మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రివ్యూ మీటింగ్ నిర్వహించాలని కంచరాం సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ కోరారు. అనంతరం గడిముడిదాంలో రూ.5.30 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల సునీత, నక్క వర్షిణి, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఈఓపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు, ఎంఈఓ పాండ్రంకి నాగయ్య, ఏపీఎం దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



వేగావతి నదిలో నడుచుకుంటూ వెళ్తున్న ఎమ్మెల్యే, తదితరులు



లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి రూరల్: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొర్లె సీతారాంపురం పంచాయతీ పరిధి భోజరాజపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరించారు. అలాగే ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని, ఎటువంటి అవినీతి జరగడం లేదని ప్రజలు చెప్పడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి వంతెన నిర్మించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఎమ్మెల్యే బదులిస్తూ ప్రభుత్వం 2020లో వంతెన మంజూరు చేసిందని.. కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేయడంతో సమస్య తలెత్తిందన్నారు. అయినప్పటికీ త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాజకీయ ఉనికి చాటుకోవడానికి ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని పట్టించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నది దాటుకుంటూ...

భోజరాజపురం గ్రామానికి వెళ్లే క్రమంలో ఎమ్మెల్యే శంబంగి, తదితరులు వేగావతి నదిలో దిగాల్సి వచ్చింది. అయినప్పటికీ వారు నీటిలో సుమారు 500 మీటర్లు, బయట మరో 500 మీటర్లు నడిచి గ్రామానికి చేరుకుని కార్యక్రమం నిర్వహించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- హోర్డింగ్‌లు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు



తెర్లాం గ్రంథాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన బ్యానర్‌ను తొలగిస్తున్న వీఆర్‌ఓ గోపాలం

తెర్లాం: కొద్ది రోజుల్లో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డోల రాజేశ్వరరావు హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు తెర్లాంలో గతంలో వివిధ పార్టీలు ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, బ్యానర్లను శనివారం తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించారు. గోడలపై అతికించిన వాల్ పోస్టర్లను తీయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగినంతవరకు ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి

- మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌కుమార్



సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌కుమార్

బొబ్బిలి రూరల్: ఉగాది రోజున (మార్చి 22) చేపట్టనున్న సామూహిక గృహప్రవేశాలకు జగనన్న కాలనీ లబ్ధిదారులను సిద్ధం చేయాలని మండల ప్రత్యేకాధికారి, మార్కెటింగ్ శాఖ ఎ.డి శ్యామ్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆరా తీశారు. నిర్మాణాలు త్వరితగతిన చేపట్టేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ డీఈఈ పి.అప్పయ్య, పట్టణ, రూరల్ ఏఈలు సూర్యనారాయణ, సింహాచలంలతో పాటు ఎంపీడీఓ అల్లు భాస్కరరావు పాల్గొన్నారు. అనంతరం హౌసింగ్ డీఈఈ పి.అప్పయ్య విలేకరులతో మాట్లాడుతూ, బాడంగి మండలంలో 975 ఇళ్లకు గాను 746 ఇళ్లు.. బొబ్బిలిలో 1761 ఇళ్లకు 1355.. పట్టణంలో 1118 ఇళ్లకు 427.. తెర్లాంలో 1211 ఇళ్లకు 770.. రామభద్రపురం మండలంలో 1230 ఇళ్లకు 899 పూర్తయినట్లు చెప్పారు.

సంక్షిప్తంగా...

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు

మెంటాడ: నిరుపేదలైన అర్హులందరికి జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ తెలిపారు. మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ డేవిడ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

కన్వీనర్లు, కో కన్వీనర్ల నియామకం

బాడంగి: వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సోషల్ మీడియా కన్వీనర్, కో కన్వీనర్లను నియమించినట్లు పార్టీ మండల నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతలపూడి శ్రీనివాసరావు (బాడంగి), కోడూరు చిన్న (కోడూరు), యజ్జల కొండలరావు, అలజంగి ప్రతాప్ (హరిజన పాల్తేరు), సున్నపు గణపతి (వాడాడ)లను నియమించినట్లు పేర్కొన్నారు. వీరంతా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ తరఫున మండలంలో జరుగుతున్న కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేస్తా రన్నారు.

పార్వతీపరమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

బాడంగి: మండలంలోని పిన్నవలసలో నిర్మించిన పార్వతీపరమేశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, యంత్రార్చాన, పంచశయ్యాదివాసములు, నీరాజనం, తదితర పూజలు చేపట్టారు. బ్రహ్మశ్రీ అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం శివలింగాన్ని ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తెంటు కన్నంనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తెంటు తిరుపతిరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

బొబ్బిలి రూరల్: మండలంలోని గొంగాడవలసలో గొంగాడవలస సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. విశాఖకు చెందిన మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు సుభద్ర, బంటీనియాలు 150 మంది రోగులను పరీక్షించారు. గర్భాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్లను గుర్తించేందుకు పాప్‌స్మియర్, మామోగ్రామ్ పరీక్షలు చేశారు. 30 మంది రోగులను మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 26న ప్రజ్ఞా వికాస పరీక్ష

బొబ్బిలి: ఈ నెల 26న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్‌లు సంయుక్తంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రజ్ఞావికాస పరీక్షను విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో పరీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకురాలు కె.విజయగౌరి మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని, ర్యాంకర్లకు నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంవీ నాగరాజు అన్నారు. స్థానిక శ్రీనివాస థియేటర్ రోడ్డులో చేపట్టిన పారిశుద్ధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కాలువల్లో వ్యర్థాలు వేయొద్దని స్థానికులకు, వ్యాపారులకు సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ ఉన్నారు.

గోవిందపురంలో..

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామంలో శనివారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. వీధి కాలువల్లో పూడికలు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. పరిసరాల పరిశుభ్రతపై సర్పంచ్ రాగోలు పద్మజ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, మాజీ సర్పంచ్ రాగోలు రమేష్‌నాయుడు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులకు అవగాహన తరగతులు

బొబ్బిలి: పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో వసతిగృహాల పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టులు, పరీక్షలపై శనివారం నిపుణులు అవగాహన కల్పించారు. పరీక్షల పట్ల ఉన్న భయాన్ని విడనాడాలని వక్తలు సూచించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమాధికారి పి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

సంగాం జాతర ఏర్పాట్ల పరిశీలన

వంగర: సంగాంలోని సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 18 నుంచి జరగనున్న జాతర ఏర్పాట్లను రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర శనివారం పరిశీలించారు. ఆలయ పరిసరాలతో పాటు త్రివేణీ సంగమం ప్రాంతాన్ని పరిశీలించి బారికేడ్లు, స్నానపు ఘాట్ల ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు ఎస్సై బి.లోకేశ్వరరావు, ఆలయ చైర్మన్ బోను ఆనందరావు, కమిటీ సభ్యులు ఉన్నారు.

ఉపాధి పనుల వద్ద వసతుల పరిశీలన

సంతకవిటి: మండలంలో మిర్తివలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పంచాయతీ సర్పంచ్ రాజాపు భూపతినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమణ శనివారం పరిశీలించారు. రెండు పూటలా పనులు చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వేతనదారులకు సూచించారు. వేసవి ప్రారంభం కావడంతో పనిప్రదేశం వద్ద తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని ఫీల్డ్‌అసిస్టెంట్‌కు సూచించారు. పనిప్రదేశం వద్ద ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని ఏపీఓ త్రినాథ్‌ను ఫోన్‌లో కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

బొబ్బిలి రూరల్: జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ డి.సింహాచలం అన్నారు. మండలంలోని అలజంగిలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బోద నివారణకు డీఈసీ మాత్రల పంపిణీ

తెర్లాం: బోదవ్యాధి (ఫైలేరియా) నివారణకు ముందు జాగ్రత్తగా తెర్లాం పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి దీక్షితారాణి అన్నారు. మండల కేంద్రంలో శనివారం మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బోద నివారణకు సంబంధించి 30, 886 మందికి డీఈసీ మాత్రలు, నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

రాజాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ప్రచారానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం ఆవిష్కరించారు. రాజాంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ.. పట్టభద్రులు సుధాకర్‌కు తొలిప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంగర కన్వీనర్ కరణం సుదర్శనరావు, రాజాం జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, గొర్లె నారాయణరావు తదితరులు పాల్గొనారు.

సామూహిక గృహప్రవేశాలకు సన్నద్ధం

రాజాం: మండలంలో వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులతో మార్చి 22న సామూహిక గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి జమదగ్ని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, సిబ్బంది, ఇంజినీరింగ్ కార్యదర్శులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా హౌసింగ్ స్కీం లబ్ధిదారుల వివరాలు, ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. లబ్ధిదారులందరితో మాట్లాడి శతశాతం నిర్మాణాలు పూర్తిచేయించాలని, సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం పలుశాఖల అధికారులతో మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఎంపీడీఓ బాసూరి శంకరరావు, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, పీఆర్‌జేఈ ప్రభాకరరావు ఉన్నారు.